క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి పల్లకిసేవ

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం విశేషాభిషేకాలు పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి దేవదేవేరులను విశేషంగా అలంకరించి పల్లకిసేవ జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



విడవలూరు: మండలంలోని వావిళ్లలోని ఈసీఐ ప్రార్థనా మందిరంలో ఫాదర్ ఈదూరు మనోహర్ కోరిక మేరకు ఎడ్నమ్మ మెమోరియల్ క్రిష్టియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు ఎడ్వర్డ్ మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని పేదలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మాతాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



కోవూరు : మండలంలోని మోడేగుంట దళితవాడలో మాతా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి సర్పంచ్ కే వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. శాస్త్రోక్తంగా శంకుస్థాపన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

మైపాడు పీహెచ్‌సీలో తనిఖీలు



ఇందుకూరుపేట: మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా క్షయ నియంత్రణాధికారి షేక్ ఖాదర్‌వలి శనివారం తనిఖీ చేశారు. వైద్య సేవలు అందిస్తున్న తీరుపై రోగులను ఆరాతీశారు. వైద్యాధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆరుగురు క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం తుపాన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి సిబ్బందికి విధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌శంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

90 మద్యం బాటిళ్ల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని బుచ్చిరెడ్డిపాళెం టోల్‌ప్లాజా వద్ద ఎస్సై మహేంద్ర శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ వాహనంలో 90 మద్యం బాటిళ్లను గుర్తించారు. వాహనం, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మందులతో క్షయ నివారణ



కోవూరు: క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఇర్ఫాన్, నిరంజన్ తెలిపారు. ఇనమడుగు పీహెచ్‌సీలో క్షయ వ్యాధిగ్రస్తులకు శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరికైనా వారానికిపైగా దగ్గు ఉంటే పీహెచ్‌సీలో గళ్ల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అన్ని పీహెచ్‌సీల్లో క్షయకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం పౌష్టికాహారం సైతం అందజేస్తుందని చెప్పారు. మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా క్షయను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కే నరసమ్మ, టీవో ఎస్కే దిలీప్, ఎంపీహెచ్‌ఓ రమణ, ఆశ వలంటీర్లు ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఇందుకూరుపేట: విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఏపీ కన్జ్యూమర్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం కోవూరు డివిజన్ మహిళా కార్యదర్శి రజిత, ఇందుకూరుపేట మండల మహిళా అధ్యక్షురాలు పావని అన్నారు. మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై శనివారం వారు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి తీవ్రమైన హాని కలుగుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి



కోడూరు తీరంలో పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్ లావణ్య

తోటపల్లిగూడూరు: బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం తుపానుగా మారే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లావణ్య సూచించారు. శనివారం ఆమె తుపాను హెచ్చరికల నేపథ్యంలో కోడూరు, వెంకన్నపాళెం తీరప్రాంతాలతో పాటు పలు లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుపానును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్ష ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. మండల కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి తీరప్రాంతంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఆదుకునేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కోడూరు, వెంకన్నపాళెం తీరప్రాంతాల్లోని మత్స్యకారులు వెంటనే వేటను నిలిపివేయాలని సూచించారు.

ఇందుకూరుపేట: తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు సూచించారు. శనివారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ సుబ్బయ్యతో కలిసి అధికారులతో సమావేశమయ్యారు. తుపాన్ కారణంగా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆహారం, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. తీరప్రాంత, లోతట్టు గ్రామాల్లో అధికారులు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం అందజేయాలని సూచించారు. తీరప్రాంత వాసులను మరింత అప్రమత్తంగా ఉంచాలన్నారు. ఎంపీడీఓ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

తుపాను సహాయక చర్యలకు కంట్రోల్ రూం

మనుబోలు: మిచాంగ్ తుపానుపై అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శివకృష్ణయ్య అధికారులు, ప్రజలకు సూచించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తుపాను నేపథ్యంలో రెవెన్యూ, నీటి పారుదల, విద్యుత్ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉరుములు, పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు బయట తిరగడం క్షేమకరం కాదన్నారు. తీర ప్రాంత గ్రామాలైన కొలనకుదురు, కట్టువపల్లి, బద్దెవోలు, పిడూరుపాళెం, పల్లెపాళెం ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులలో ప్రజలను తరలించేందుకు కొలనకుదురులో తుపాను షెల్టర్‌ను సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. తుపాను సహాయక చర్యలకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితుల్లో 99598 00785 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్, పారిశుధ్యం, తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విడవలూరు: తుపాను నేపథ్యంలో మెరైన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సీఐ సురేష్ సూచించారు. మండలంలోని తీరం వెంబడి మెరైన్ సిబ్బంది శనివారం గస్తీ నిర్వహించి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



కోవూరు: తుపానుపై అధికారులు, నాయకులు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే నలపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో శనివారం ఆయన సాక్షితో మాట్లాడారు. జిల్లాలో తుపాను ప్రభావం ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ఉంటుందన్నారు. 3వ తేదీ మధ్యాహ్నం నుంచి వర్షంతో పాటు గాలి కూడా వీచే అవకాశం ఉందన్నారు. 4వ తేదీ సోమవారం భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వేటకు వెళ్లకుండా తీరప్రాంత, పెన్నా నది పరీవాహక ప్రాంత మత్స్యకారులను అప్రమత్తం చేయాలని తెలిపారు. పౌర సరఫరాల, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో నిత్యావసర సరుకులు అవసరమైన మేరకు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తుగా ఓవర్ హెడ్ ట్యాంకులను నింపాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనరేటర్లు, డీజిల్‌ను అవసరం మేరకు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తుపాన్ సమయంలో అత్య అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ఇందుకూరుపేట: అధికారులకు సూచనలు ఇస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి



రామతీర్థం తీరంలో గస్తీ నిర్వహిస్తున్న మెరైన్ సిబ్బంది

తీరంలో ముసురు

తోటపల్లిగూడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో మండలంలో శనివారం ముసురు పట్టింది. ఆకాశం మేఘావృతమై ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో జన జీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు ముంపునకు గురయ్యాయి. తీరప్రాంత వాసులు ఇళ్లు వదిలి బయటకు రాలేకపోయారు. తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతుండడంతో మత్స్యకారులు వేటను నిలిపివేసి తమ వేట సామగ్రిని సురక్షిత ప్రదేశంలో భద్రపరుచుకున్నారు.

ముత్తుకూరు: తీవ్ర వాయుగుండం ప్రభావంతో మండలంలో శనివారం ఉదయం నుంచి వర్షం కుండపోతగా కురుస్తోంది. ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. పంటపొలాలు దొరువుల్లా మారాయి. వాయుగుండం దెబ్బకు సముద్రంలో ఉవ్వెత్తున అలలు ఎగసిపడుతున్నాయి. మత్స్యకారులు వేటకు విరామం ప్రకటించి పడవలను ఒడ్డున భద్రపరుచుకున్నారు.

తీరంలో ఎగిసిపడుతున్న అలలు

ఇందుకూరుపేట: తీవ్ర వాయుగుండం ప్రభావంతో మైపాడు తీరంలో అలలు ఎగిసిపడుతున్నాయి.



టీపీగూడూరు : కోడూరు తీరంలో ఎగిసిపడుతున్న అలలు

ఇప్పటికే వేటకు తాత్కాలికంగా స్వస్తిపలికిన మత్స్యకారులు తమ వేట సామగ్రి బోట్లు, వలలు తీరంలో భద్రపరుచుకున్నారు. కాలయాపన కార్యక్రమాలతో కాలం వెళ్లదీశారు. తుపాన్ కారణంగా మైపాడు బీచ్‌కు పర్యాటకుల రాక తగ్గింది. కోవూరు సీఐ డీ వెంకటేశ్వరరావు, స్థానిక ఎస్సై వీరేంద్రబాబు మైపాడు బీచ్ వద్ద పరిస్థితిని పరిశీలించారు. స్థానిక మత్స్యకార నాయకులతో మాట్లాడి వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. బీచ్‌కు పర్యాటకులు రావద్దని కోరారు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

మనుబోలు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ప్రసాద్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వికసిత్ భారత్ యాత్రపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాంటి ఎన్నో వినూత్న పథకాలను కేంద్రం అమలు చేస్తుందని, వాటిపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివకృష్ణయ్య, వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు, ఏఈలు చంద్రశేఖర్, కార్తీక్‌రెడ్డి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కృష్ణవేణి, ఎంఈఓ శేషాద్రివాసు, ఎస్‌బీఐ మేనేజర్ ప్రశాంతి ప్రియదర్శిని, ఏపీఓ రాజమ్మ, ఏపీఎం వనజాక్షి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నారుమడులు, నాట్లను వాయిదా వేసుకోవాలి



వరి నాట్లను పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు: తుపాను నేపథ్యంలో మూడ్రోజుల పాటు వరి నారుమడులు పోయడం, నాట్లు వేయడాన్ని రైతులు వాయిదా వేసుకోవాలని ఏఓ సీహెచ్ ఎస్ లక్ష్మి సూచించారు. మండలంలోని గుండాలమ్మపాళెంలోని వరి పొలాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో ఈ నెల 3,4,5 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నారుమడుల్లో అధికంగా ఉన్న నీటిని బయటకు పంపడంతో పాటు డ్రమ్ సీడర్, నేరుగా విత్తే పద్ధతుల్లో వరి సాగును కొద్ది రోజులు వాయిదా వేసుకోవాలని తెలిపారు. పొలాల మురుగు నీటి కాలువ గట్లను పటిష్ట పరచుకోవాలని సూచించారు. ఏఓ వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, వీఏఏ కే విష్ణుప్రియ, రైతు డేగా మధు ఉన్నారు.

వడ్డెర్ల పాదయాత్రకు సంఘీభావం



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న వడ్డెర ఉద్యోగులు

కొడవలూరు: వడ్డెర్లకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ అమర్‌నాథ్ నాయకత్వంలో తిరుపతి నుంచి విజయవాడకు చేపడుతున్న పాదయాత్రకు జిల్లా వడియారాజ్ ఉద్యోగుల సంఘ నేతలు సంఘీభావం ప్రకటించారు. శనివారం కలువాయి మండలానికి చేరుకున్న పాదయాత్రలో వడియారాజ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంజి నాగభూషణం ఆధ్వర్యంలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఆదూరుపల్లి వరకు పాదయాత్ర చేసి రూ.5 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వడ్డెర్లకు ఎస్టీ హోదా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయబద్ధమైన పాదయాత్రకు వడ్డెర ఉద్యోగుల సంఘం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో వడ్డెర ఉద్యోగుల సంఘ నేతలు గుంజి నరసింహారావు, దయాకర్, చల్లా లక్ష్మయ్య, మనోహర్, బెల్లంకొండ మణెయ్య, చంద్రగిరి రమణయ్య, శ్రీనివాసులు ఉన్నారు.

9లోగా ఓటరు నమోదును పూర్తి చేయాలి

- స్పెషల్ కలెక్టర్ ఓబులేసు



ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఓబులేసు

మనుబోలు: ఈ నెల 9వ తేదీతో ఓటరు నమోదు గడువు ముగియనుందని, ఆ లోగా ఓటరు నమోదును పూర్తి చేయాలని స్పెషల్ కలెక్టర్ ఓబులేసు బీఎల్‌ఓలను ఆదేశించారు. మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బీఎల్వోల పనితీరు సక్రమంగా లేదన్నారు. బీఎల్వోల సేవలపై కలెక్టర్ అసంతృప్తిగా ఉన్నారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రతి 1000 మంది పురుష ఓటర్లకు 1061 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వార్డుల వారీగా స్త్రీ, పురుష ఓటర్ల మధ్యన అంతరాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల మార్పు, చేర్పులు, కొత్త ఓట్ల నమోదును డిసెంబర్ 9 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్న సందర్భంగా బీఎల్‌ఓలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉడాలని సూచించారు. ఆయన వెంట వీఆర్వోలు నాగార్జునరెడ్డి, నాగేశ్వరావు, మురళీధర్, తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు: జగనన్న గృహ నిర్మాణాల లక్ష్యాలను డిసెంబర్ నెలాఖరులోగా నూరు శాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీహరి ఆదేశించారు. కోవూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఈలతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నెలాఖరుకు గృహాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. గృహ లబ్ధిదారులకు అవగాహన కల్పించి నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలను పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన పంచాయతీ కార్యదర్శులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాన్ ప్రభావంతో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల్లోని గృహాల వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. దెబ్బతిన్న ఇళ్లలో ఉంటున్న వారిని అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లేలా చూడాలన్నారు. ఈ సమీక్షలో పంచాయతీరాజ్ ఏఈలు మాధవయ్య, పరమేశ్వర లింగం, డ్వామా ఏపీఓ సుబ్బారావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి చైతన్య

కోవూరు : కోవూరు కోర్టు ప్రాంగణంలో ఈ నెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి పీ చైతన్య కోరారు. కోవూరులోని కోర్టు హాల్లో లోక్ అదాలత్‌పై సీఐలు, ఎస్సైలతో శనివారం జడ్జి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో రాజీకి వీలైన కేసులను సత్వరమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. కక్షిదారులకు అవగాహన కల్పించి అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కాత్యాయని, స్పెషల్ మేజిస్ట్రేట్ ఐ కృష్ణయ్య, కోవూరు సీఐ డీ వెంకటేశ్వరరావు, ఎస్‌ఈబీ సీఐ నరహరి, ఎస్సైలు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్-వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎస్‌సీ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉంటే ఉద్యోగావకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. అనంతరం పార్లపల్లి ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీలకు కంప్యూటర్ అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లలిత, ఏపీ ప్రసాద్, కంప్యూటర్ ఫ్యాకల్టీ విద్యుల్లత, శార్వాణి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రుడు

వెంకటాచలం: ఆగిఉన్న మోటారు సైకిల్‌ను మరో మోటారు సైకిల్ ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. సర్వేపల్లి నుంచి వెంకటాచలం వైపు మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి వర్షంతో తన మోటారు సైకిల్‌ను రోడ్డుపై ఆపి చెట్ల కిందకు వెళ్లాడు. అదే మార్గంలో మరో మోటారు సైకిల్‌పై వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడగా నెల్లూరుకు తరలించారు.

ఒక యూనిట్లో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో ఒకటో యూనిట్ నుంచి మాత్రమే 450 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాలతో 2, 3 యూనిట్లలో విద్యుదుత్పత్తి నిలిపివేసినట్టు జెన్‌కో ఇంజినీర్లు శనివారం వెల్లడించారు.

కల్వర్టులకు నిధుల మంజూరుపై కృతజ్ఞతలు

విడవలూరు: మండలంలోని వరిణి గ్రామంలోని గిరిజన కాలనీకి వెళ్లేందుకు అడ్డుగా ఉన్న కాలువలపై రెండు కల్వర్టుల నిర్మాణానికి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రూ.10 లక్షలు మంజూరు చేయించారని సర్పంచ్ రావెళ్ల మల్లికార్జునరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గిరిజన కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారని చెప్పారు. ఆ సమయంలో కాలువలపై కల్వర్టులు లేక కాలనీకి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే కల్వర్టుల నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారని చెప్పారు. ఈ నిధులతో త్వరలోనే పనులు ప్రారంభించి కల్వర్టులను పూర్తి చేస్తామన్నారు. కల్వర్టులకు నిధులు మంజూరు చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సహకరించిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

విడవలూరు: కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 15వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. తాగునీరు కలుషితం కాకుండా, దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణకు చర్యలు చేపట్టేందుకు మండల స్థాయిలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సెల్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, వైద్యారోగ్య సిబ్బంది, ఇతర అధికారులను సమన్వయం చేసుకుంటూ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా పారిశుధ్య సమస్య ఉంటే 99492 39492 నంబర్‌కు తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తామని ఈఓపీఆర్డీ నారాయణ శాస్త్రి తెలిపారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వెంకటాచలం: ప్రపంచ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన వెంకటాచలంలో గ్రామీణ పర్యావరణం, వ్యవసాయ అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివారణపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీలో పాల్గొని ప్లాస్టిక్ వస్తువులు పర్యావరణానికి తీవ్రమైన హానిని కలుగజేస్తాయని, వాటిని నిషేధించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పర్యావరణం, వ్యవసాయ అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ఆరుముళ్ల మురళి, పాల్గొన్నారు.